

# వీవోఏలపై రాజకీయ వేధింపులు మానుకోవాలి

**హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి : యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు**




వీఓఏల సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** జిల్లాలో ఉన్న వీవోఏలపై రాజకీయ వేధింపులు మానుకోవాలని, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి, మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం చిత్తూరు సిఐటియు కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశానికి ఆగస్తి అధ్యక్షత వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ ప్రస్తుత మంత్రులు, ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గత ప్రభుత్వం వీవోఏల ఉపాధి దెబ్బతీసే మూడు సంవత్సరాలు కాలపరమితిని తాము అధికారంలోకి వస్తే తొలగిస్తామని హామీ ఇచ్చి సంవత్సరం పైన అవుతున్నప్పటికీ ఇప్పటివరకు రద్దు చేయకపోవడం దారుణమన్నారు. గతంలో పోరాటాలు చేసిన సందర్భంగా స్వయంగా మద్దతు ఇచ్చిన ప్రస్తుత మంత్రులు ఇప్పుడెందుకు ఆ సమస్యలు ప్రస్తావన తీసుకురావడం లేదన్నారు. వెంటనే వీవోఏలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దు చేయాలని, జెండర్ విధానాన్ని రద్దు చేయాలని, వేతనాలు విఓఏల అకౌంట్‌కి జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం కోసం వీఓఏ అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. మండల స్థాయి నుంచి జిల్లా రాష్ట్రస్థాయి వరకు మహాసభలు నిర్వహించి నూతన నాయకత్వం ఎన్నుకొని భవిష్యత్తు పోరాటాలను బలోపేతం చేయడానికి తీర్మానాలు చేస్తామని తెలిపారు. వీవోఏల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, జిల్లా నాయకులు మమత అంజప్ప పాల్గొన్నారు.



రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాయలసీమవాసులు

# సంతోషంతో...సొంతింటికి..!

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

సంతోషం వారి మోములో వెల్లివిరిసింది. బతకడానికి, చదువుకోడానికి దేశం గాని దేశం వెళ్లిన ఆంధ్రరాష్ట్ర ప్రజానీకం నేపాల్ అల్లర్లలో చిక్కుకుపోయిన విషయం విదితమే. మంత్రి నారా లోకేష్ చొరవతో ఖాట్మండ్ నుంచి గురువారం రాత్రి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ప్రత్యేక విమానాల ద్వారా రేణిగుంట ఎయిర్‌పోర్టుకు తీసుకొచ్చి, అక్కడనుంచి సొంతూళ్లకు రోడ్డుమార్గంలో పయనమయ్యేలా ఏర్పాట్లు చేశారు.

బతకడానికి, పర్యాటకానికి, చదువుకోడానికి వెళ్లిన తెలుగువారిని రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖర్చులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మంత్రి నారా లోకేష్ స్వరాష్ట్రానికి తీసుకొచ్చారు. గురువారం రాత్రి 10.10 నిమిషాలకు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రేణిగుంటకు తీసుకొచ్చారు. వీరికి కడప, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం, తిరుపతి జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు స్వాగతం పలికి, వారి వారి స్వగ్రామాలకు వెళ్లేలా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చిన ప్రయాణికులకు తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎంఎల్‌ఎ పులివర్తి నాని, పూతలపట్టు ఎంఎల్‌ఎ మురళీమోహన్, కడప ఎంఎల్‌ఎ మాధవరెడ్డి, సూళ్లూరుపేట ఎంఎల్‌ఎ విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు స్వాగతం పలికారు. వారికి భోజన ఏర్పాట్లు చేసి, అధికార యంత్రాంగమే వారి సొంతూళ్లకు వెళ్లేలా వాహనాలను ఏర్పాటు చేసింది. తిరుపతి జిల్లావారు 14 మంది ఉన్నారు. చంద్రబాబు, నారా లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. నేపాల్ నుంచి 217 మంది తెలుగువారిని ఆంధ్రరాష్ట్రానికి తీసుకురాగా, రేణిగుంట విమానాశ్రయానికి వందమంది పైనే చేరుకున్నట్లు సమాచారం.

## నిత్యాన్నదాన ట్రస్టును ప్రారంభించిన ఎంపి



నిత్యాన్నదాన ట్రస్టును ప్రారంభిస్తున్న ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్**: కాణిపాకంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ దేవరాయ నిత్యాన్నదాన ట్రస్టు, కార్యాలయాన్ని ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్.మనోహర్ గురువారం ప్రారంభించారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన ఎంపీకి ట్రస్టు సభ్యులుసాదర స్వాగతం పలికారు. ఎంపి మాట్లాడుతూ దానాలో కెల్లా అన్నదానం మిన్న అని అన్నారు. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి సన్నిధిలో శ్రీకృష్ణ దేవరాయ నిత్యాన్నదాన ట్రస్టును ఏర్పాటు చేసి భక్తుల ఆకలిని తీర్చడం అభినందనలు తెలిపారు. ఇలాంటి అన్నదాన ట్రస్టులు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు గురువారం సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. మిట్టూరుకు చెందిన కుసుమ రూ.లక్ష, రామభద్రాపురం పంచాయతీకి చెందిన శరత్‌కు రూ.40వేలు సిఎం సహాయనిధి అందించారు. ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి కష్టాలలో ఉన్న ప్రజలకు ఊపిరినిస్తుందన్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

**కుప్పం:** కుప్పం పార్టీ కేంద్ర కార్యాలయంలో కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 27మందికి రూ.18,28,321 కుప్పం రూరల్ పరిధిలో 32 మందికి రూ.25,30,548 సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పంపిణీ చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలు నేపథ్యంలో వైద్యం కోసం ఆర్థిక సాయం చేయాలంటూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా 59 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, మాజీ ఏఎంసి చైర్మన్ సత్యేంద్ర శేఖర్, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, కో క్లస్టర్ తిరుమగళ్ పాల్గొన్నారు.

## దొరస్వామికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



వీసీని సన్మానిస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు

**ప్రజాశక్తి- గుడిపల్లి:** ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యం.దొరస్వామికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘ నాయకులు అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.నరేష్ ఉపకులపతిని వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, మురళి, కిరణ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## డ్వామా అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారిణిగా ధనలక్ష్మి

**ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)**



చిత్తూరు జిల్లా ఉపాధి హామీ పథకం (ఎంఅండ్ ఇ) అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారిగా ధనలక్ష్మి గురువారం జిల్లా నీటి యజమాన్య సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఐరాల మండల అభివృద్ధి అధికారిగా ఆమె గతంలో పనిచేశారు. ప్రభుత్వం ఎంపీడీవోలకు ఉద్యోగోన్నోతలు కల్పించడంతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రోగ్రాం అధికారిగా నియమించారు. జిల్లా పరిధిలోని 31 మండలాలకు సంబంధించి ఉపాధి హామీ పనులపై రోజువారి పర్యవేక్షణ చేయడం, ఉపాధి పనుల పనితీరు, జిల్లాలో జరుగుతున్న పనులను పర్యవేక్షణ, ఉపాధి పనులకు సంబంధించిన అంచనాలు, మూల్యాంకనం చేసి ఫలితాలను తెలుసుకోవడం, లక్ష్యాలు సాధనపై విశ్లేషించడం వంటి పనులను మానిటరింగ్ చేస్తారు.

## ఎమ్మెల్యే కార్యాలయంలో వినతుల స్వీకరణ

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** స్థానిక లక్ష్మీనగర్ కాలనీ ఎమ్మెల్యే కార్యాలయంలోని ప్రజాదర్బార్‌లో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రజలు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాన్ని జత చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

# 20 నుంచి రైతుల ఖాతాల్లోకి సబ్సిడీ జమ

- మామిడి రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- 4.10 మెట్రిక్ టన్నుల పైగా తోతాపురి కొనుగోలు
- రూ.160 కోట్లు పైబడి సబ్సిడీ జమ: కలెక్టర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

**ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి):** మామిడి రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలిచిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు కేజీ తోతాపురి రూ.4 చొప్పున రూ.160 కోట్లకు పైగా ఈనెల 20 నుండి 25వ తేదీలోపు దాదాపు 37 వేల మంది రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో మామిడి రైతులకు జమ చేయనున్న సబ్సిడీపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ మామిడి సీజన్‌లో సుమారు 37వేల మంది రైతుల నుండి గుజ్జు పరిశ్రమలు, ర్యాంపుల ద్వారా దాదాపు 4.10 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. చివరి కేజీ వరకు కూడా కొనుగోలు చేయడం జరిగిందని, పరిశ్రమలు, ర్యాంపుల వద్ద కేజీ రూ.8లు, ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.4లు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సెప్టెంబర్ 20 నుండి 25వ తేదీ లోపు రైతుల ఖాతాలకు డిబిటి పద్ధతిలో సుమారు రూ.160 కోట్లు సబ్సిడీ జమచేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల అభివృద్ధికి సుమారు రూ.20 కోట్లు ఖర్చు చేయగా, మామిడి కాయల కవర్లు, కొత్త మొక్కలు, మౌలిక సదుపాయాలు, ట్రైనింగ్‌కి సంబంధించి రూ.10 కోట్లు ఖర్చు చేశామన్నారు. 10,500 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ కొరకు రూ.100కోట్లకు పైగా ఉపకరణాలు అందించడం జరిగిందన్నారు. సబ్సిడీకి స్పందించి ప్రభుత్వం ఇచ్చిన సూచనలను మాత్రమే రైతులు గుర్తుంచుకోవాలని, బయట వ్యక్తుల మాటలు నమ్మవద్దని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక రంగ అభివృద్ధికి సహకారం అందిస్తుందని, ముఖ్యమంత్రి మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల శ్రేయస్సును ఆలోచిస్తున్నారు. సబ్సిడీ జమ కాని రైతులు ఆందోళన చెందవద్దని, ఆర్ఎస్‌కేల వద్దకు వెళ్లి సమస్యలను తెలియజేస్తే జమ చేస్తామన్నారు.

# కోకావాండ్లలో మౌలిక వసతుల కల్పన

**రూ.100 కోట్లతో రోడ్డు, నిర్మాణాల పనులు**



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్**

కోకావాండ్ల ఊరిలో డిసెంబర్ నెలలోపు మౌలిక వసతులు పూర్తి చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం చిత్తూరు నగరపాలక పరిధిలో 49వ వార్డు, 50 వార్డు కోకావాండ్ల ఊరిలో, మట్టి రోడ్డు, డ్రైనేజ్, విద్యుత్ సౌకర్యాలు, కుక్కల బెడద, అంబులెన్స్ సమస్య, వివిధ అంశాలపై గ్రామస్తులు కలెక్టర్‌కి విన్నవించారు. అపోలో హాస్పిటల్ వెనుక వైపు నుండి కోకావాండ్ల ఊరిలో కలెక్టర్ స్వయంగా రెండు కిలోమీటర్లు నడుస్తూ పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాన్ని డిసెంబర్ లోపు అన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ గ్రామీణ ప్రాంతాలలో సుమారు రూ.100 కోట్లతో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టడానికి ఆమోదించడం జరిగిందని తెలిపారు. సుమారు రూ.70 నుంచి 80కోట్లల వరకు వివిధ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కాలనీలలో రోడ్ల నిర్మాణం పనులు జడ్పీ నిధుల ద్వారా ఖర్చు పెట్టడం జరిగిందని తెలిపారు. నిన్నటి రోజు పలమనేరు నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతంలో సుమారు జడ్పీ నిధులు ద్వారా రూ.1.50కోట్లలతో రోడ్డు నిర్మాణాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. పట్టణ ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చిత్తూరు పట్టణంలో 7,8, వార్డులలో రూ.3కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కోకావాండ్ల ఊరిలో అభివృద్ధి చేయడానికి ఏప చర్యలు చేపట్టాలి, సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని, మున్సిపల్ కమిషనర్, ఎంఆర్‌ఓను జాబితాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పక్కా ప్రణాళికలతో డిసెంబర్ లోపు అన్ని మౌలిక వసతులు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, ఈఈ వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్య అధికారి లోకేష్, పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, చిత్తూరు ఎమ్మార్వో కులశేఖర్, పాల్గొన్నారు.

# తాగునీటికి కట.. కట..

- 15 రోజులుగా కేసవపురంలో నీటి సమస్య
- పాడైన ఇల్లత్తూరు కుశస్థలి నది పైపులైన్
- ఎంబుక్ చేయాలంటే 6శాతం ఇచ్చుకోవాల్సిందే..



పాచిపట్టిన తాగునీటి ట్యాంకు

**ప్రజాశక్తి- విజయపురం:**

విజయపురం మండలంలో తాగునీరు ఓ సమస్యగా మారింది. ఏ గ్రామానికి వెళ్లిన తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పుకుందామంటే మండలంలో అధికారులు అందుబాటులో ఉండడం లేదు. ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కనబడి నెలలు గడుస్తున్నాయి. వచ్చినా నగరి డీఈ కార్యాలయానికే పరిమితమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**కేసవపురం తీవ్రమైన తాగునీటి సమస్య..**

కేసవపురం, ఆదిఆంధ్రవాడలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గత 15రోజులుగా తాగునీరు రావడం లేదు. ఇల్లత్తూరు కుశస్థలి నది నుంచి రావల్సిన పైపులైను మరమ్మతులకు గురికావడంతో గత 15 రోజులుగా తాగునీరు రావడం లేదు. దీంతో బోరు, బావుల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ బావిలో పాచపట్టి ఉన్న నీటినే అందిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో బావిలో నీళ్ల తాగడం వల్ల జ్వరం, జలుబు చేస్తున్నాయని వాపోయారు. ఉన్నతాధికారులకు చెప్పితే స్థానికంగా ఉన్న సర్పంచ్, సచివాలయ సిబ్బందికి చెప్పండి అంటూ సమాధానం చెప్పడంతో ప్రజలు ఏమి చేయలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.



పాడైన బోరు బావి

ఇదిలా ఉండగా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మండల కార్యాలయానికి నెలమొత్తంలో రెండు, మూడు రోజులు మాత్రమే వస్తున్నట్లు మండల వాసులు చెప్తున్నారు. వచ్చిన ఏదో ఒక సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను తీసుకొని నామమాత్రంగా ఏదో ఒక గ్రామానికి వెళ్లి నోట్, కెమెరాలు ఫోటోలు పట్టుకొని వెళ్లపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు ఆర్డబ్ల్యూఎస్ ఏఈనీ మండల కార్యాలయంలో ఉంటూ తాగునీటి సమస్య లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**6శాతం ఇవ్వాల్సిందే..**

మండలంలోని ఏ గ్రామంలో అయినా తాగునీరు పైప్లైన్లు బోర్లు వేసినా, మరమ్మతులు చేసినా సర్పంచ్‌లు 6 శాతం కమిషన్ ఇస్తే కానీ బిల్లులు పెట్టడం లేదు. దీంతో సర్పంచ్‌లు బోరు, పైపులైన్లను సరి చేయడానికి భయపడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామస్తుల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**డిఎం అండ్ హెచ్‌ఓ కోసం**

## గంటల తరబడి వేచి ఉండాల్సిందే..

**స్కీం వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు**



డిఎంఅండ్ హెచ్‌ఓ ఛాంబర్ ముందు వేచి ఉన్న సందర్శకులు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** డిఎం అండ్ హెచ్‌ఓని కలవాలంటే గంటల తరబడి వేచి ఉండే పద్ధతి మారాలని స్కీమ్ వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. గురువారం డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయంను సందర్శించిన సందర్భంగా అనేక రకాల అంశాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలోని మెడికల్ డిపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న సిబ్బంది, ప్రజలు రకరకాల సమస్యల మీద జిల్లా వైద్యాధికారిని కలవడానికి వస్తే గంటల తరబడి వేచి ఉండి విసుగెత్తి వెనుదిరుగుతున్న పరిస్థితి కనబడింది. అక్కడ వేచి ఉండడానికి కనీస సౌకర్యాలు కూడా లేకుండా ఇబ్బంది పడుతున్నారు. చంటి బిడ్డలతో వచ్చే వారు కూడా కూర్చోవడానికి కుర్చీలు లేవు గంటలు తరబడి వేచి ఉన్న కలుస్తారన్న ఆశ కూడా లేదు. అత్యవసరంగా కలెక్టర్ పిలిచారని వెళ్లిపోయిన సందర్భాలు వున్నాయి. చిన్న బిడ్డలను కూడా తీసుకొస్తున్న తల్లులు అధికం. వారు కూడా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. జిల్లా అధికారులు ప్రజలు సమస్యలు, సిబ్బంది సమస్యలకు కూడా సమయం కేటాయించి పట్టించుకునే పరిస్థితి వాతావరణం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుపతి నుండి అత్యధిక మంది అధికారులు వచ్చి సాయంత్రం వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకొని డిఎంఅండ్ హెచ్‌ఓ ఆఫీసులో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌పై శిక్షణ



ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ విషయాలు తెలియజేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఓ

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని డాక్టర్లకు, స్టాఫ్ నర్స్‌లకు, ఫార్మసిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు ఈ 4 కేడర్లకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రజలందరూ తప్పనిసరిగా అభ (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్) ఐడి క్రియేట్ చేసుకోవాలని తద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు ఆన్లైన్ ద్వారా నిర్వహించుట జరుగుతుందన్నారు. ప్రస్తుతం కుప్పంలో డిజిటల్ నర్వ్ సెంటర్ నడుస్తుందని, అలాగే చిత్తూరులో కూడా ప్రారంభించడం జరుగుతుందన్నారు. కావున సులభతంగా సేవలు అందించడానికి ప్రతి పిహెచ్సి, అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రజలందరికీ అభ ఐడి క్రియేషన్ తప్పనిసరి చేసిందని, అభ ఐడి క్రియేషన్ 100శాతం సాధిస్తే డిజిటల్ నర్వ్ సెంటర్ ద్వారా చాలారకాల అనారోగ్యాలకు సులభంగా ఆరోగ్య సంరక్షణ సేవలు అందించవచ్చును అని తద్వారా యూనివర్సల్ హెల్త్ ఫర్‌ఆల్ సాధించవచ్చు అన్నారు. కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం అధికారి సుశీల అభ ఐడి క్రియేషన్‌పై సులభంగా అందరికీ అర్థమయ్యే రీతిలో శిక్షణ ఇచ్చారు. డిపిఎంఓ డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనూష, రాంమోహన్ పాల్గొన్నారు.

## కుప్పం డీడీవోగా రామచంద్ర

**ప్రజాశక్తి- కుప్పం**



కుప్పం డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా రామచంద్ర నియమితులయ్యారు. కడప జిల్లాలో పనిచేస్తున్న రామచంద్రను కుప్పం డీడీవోగా నియమిస్తూ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ విఆర్‌కె.తేజ మైలవరపు ఉత్తర్వులు జారీ చేశారు. రామచంద్ర గతంలో కుప్పం ఎంపీడీవోగా పనిచేశారు. ఆయన మరో రెండు రోజుల్లో కుప్పం డీడీఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు..

## కేన్సర్ లక్షణాలున్న వారిని గుర్తించండి

**డిఎం అండ్ హెచ్‌ఓ**

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి, పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి, కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎల్‌హెచ్‌పిలకు నేటి నుంచి 18వ తేదీ వరకు అన్ని పిహెచ్‌సిల వారికి ఎన్‌సిడి 4.0పై శిక్షణ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆదేశాల మేరకు ఎన్‌సిడి నోడల్ అధికారి డాక్టర్ గిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్‌సిడి 3.0 సర్వే జరిగింది, ఎన్‌సిడి 4.0లో ప్రతి ఇంటిలో క్వాలిటీగా సర్వే నిర్వహించి కేన్సర్ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే చికిత్స ప్రారంభిస్తారని తెలిపారు. కావున కేన్సర్ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేలా క్షేత్రస్థాయి స్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఓరల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ క్యాన్సర్ పై డాక్టర్లకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు క్షేత్రస్థాయి సిబ్బందికి , ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి ఎన్సిడి 4.0 కార్యక్రమాన్ని క్వాలిటీగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ మమతారాణి, జిల్లా ఎపిడి మియాలజిస్ట్ శ్రీవాణి , ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి -కుప్పం:** కుప్పం మండలం సర్వసభ్య సమావేశంలో 12వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల మీట్ నిర్వహించడం జరుగుతుందని సమావేశానికి ఎంపీపీ, జడ్పిటిసితోపాటు ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజాసమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు.

## బాలికల విద్య.. దేశ ప్రగతికి మార్గం

**ప్రజాశక్తి- కుప్పం:** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అడవి బూదుగూరు హరిజనవాడలో గురువారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చిట్టిబాబు మాట్లాడుతూ బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ఏ రంగాల్లో అభిరుచి, ఆసక్తి ఉందో ఆ రంగాలలో వారి అభివృద్ధికి మనం దోహదపడాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయేంద్ర, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యం యాదవ్‌కు సన్మానం



**ప్రజాశక్తి- విజయపురం:** తిరుపతి జిల్లా యాదవ మహాసభ అధ్యక్షులుగా విజయపురం మండలం జంబాడకు చెందిన సుబ్రహ్మణ్యం యాదవ్‌ను రాష్ట్ర తెలుగు యాదవ మహాసభ అధ్యక్షుడు కోన గురవయ్య యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడిని మర్యాదపూరకంగా కలిసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ యాదవ కమ్యూనిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## రూ.8 కోట్లతో ఆలయ అభివృద్ధి

**ప్రజాశక్తి- కుప్పం:** ఆంధ్ర – తమిళనాడు సరిహద్దులోని కుప్పం మండలం పాలారు నది తీరంలో వెలసిన శ్రీ కనక నాచారమ్మ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించింది. ఆలయ అభివృద్ధికి రూ.3.5 కోట్లు, రిటర్నింగ్ వాల్ కోసం మరో రూ.4.5 కోట్లు కేటాయించింది. దీంతో గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, టిడిపి సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్ పూజా కార్యక్రమాల నిర్వహించి పనులను ప్రారంభించారు. పాలారు నది తీరంలో వెలసిన శ్రీ కనక నాచారమ్మ ఆలయాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం జరుగుతుందని, ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఏపీఇడబ్ల్యు ఐడిసి ఛైర్మన్ రాజశేఖర్, డాక్టర్ వెంకటేష్, రెస్కో డైరెక్టర్ శివ, కౌన్సిలర్ సోమశేఖర్, సర్పంచ్ సంతోష్, మహేంద్ర, దయాకర్, జయరాంనాయుడు పాల్గొన్నారు.

## నేడు సర్వసభ సమావేశం: ఎంపీడీవో

**ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం:** మండల కేంద్రమైన ఎస్ఆర్.పురం ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో మోహన మురళి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంకు వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని మండల అభివృద్ధికి సంబంధించిన నివేదికను సమర్పించాలన్నారు.

## డిగ్రీ కళాశాలలో అతిథి ఉపన్యాసం



**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** స్థానిక డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద ఆదేశాల మేరకు పుత్తూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఎకనామిక్స్ లెక్చరర్ పి.వరలక్ష్మి గురువారం 'రోజువారి జీవితంలో సూక్ష్మ అర్థశాస్త్రం అనువర్తనాలు' అనే అంశంపై గెస్ట్ లెక్చరర్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగపతి డాక్టర్ డీ.లావణ్య కుమారి, అతిథి అధ్యాపకులు డాక్టర్ కే.పాండ్య రాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చల్లా రామచంద్రారెడ్డికి సత్కారం



**ప్రజాశక్తి - రొంపిచర్ల:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాక్ వర్డ్ క్లాసెస్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సదుం మండలానికి చెందిన అమర్నాథ్ ఎన్నికైన సందర్భంగా గురువారం ఆయన, వారి అనుచరులు పుంగనూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి చల్లా రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసి పూలమాలలతో సన్మానించారు. అమర్నాథ్‌కు చల్లా బాబు రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసారు. డైరెక్టర్ పదవికి వన్నె తేవాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చే విధంగా పనిచేయాలన్నారు. అనంతరం అమర్నాథ్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసినందుకు తగిన ఫలితం వచ్చిందని, ఈ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, జిల్లా ఇంచార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు.

## నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** 12న శుక్రవారం మండలంలో ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ పర్యటించనున్నారని వెలుగు అధికారి పరుశురాం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండంలోని వెలుగు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని బ్యాంకుల ద్వారా రుణమేళా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతారని, కనుక మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

## కరాటేలో నగరి విద్యార్థుల ప్రతిభ



**ప్రజాశక్తి- విజయపురం (నగరి):** తమిళనాడు ఆర్‌కే పేటలో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే పోటీల్లో నగరికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనభరిచారు. స్థానిక కరాటే మాస్టర్ రాజ్‌కోటి నేతృత్వంలో 32 మంది ఈ పోటీల్లో పాల్గొనగా వివిధ విభాగాల్లో 14 మంది ప్రథమ బహుమతిని, ఆరుగురు ద్వితీయ బహుమతిని, 8 మంది తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ప్రతిభ చూపి బహుమతులు సాధించిన విద్యార్థులు సినీ నటుడు రియజ్‌ఖాన్ నుంచి బహుమతులు అందుకున్నారు.

## టిడిపి కార్యాలయం ప్రారంభం



**ప్రజాశక్తి- తవణంపల్లి:** మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ ప్రారంభించారు. గురువారం మండల కేంద్రానికి చేరుకున్న ఎమ్మెల్యేకు మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పార్టీ జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో కార్యకర్తల ఆవాసంగా, ప్రజాసమస్యల పరిష్కార కేంద్రంగా మండల పార్టీ కార్యాలయం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి మధుకుమార్ యాదవ్, గాలి దిలీప్ కుమార్, సునీల్ చౌదరి, మోహన్ నాయుడు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు అవగాహన సదస్సు

**ప్రజాశక్తి- పలమనేరు:** పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం మధ్యాహ్నం నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ ఆధ్వర్యంలో విలువలతో కూడిన అవగాహన సదస్సును మాదేశ్ బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదేశ్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో శ్రమపడి కష్టపడి తమ ఆశయాలను తమ పిల్లల్లో చూసుకోవాలని దూర ప్రాంతమైన పంపించి చదివస్తున్నారని తెలిపారు. యుక్త వయస్సులో ఆకర్షణలో పడకుండా తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. ఉన్నతమైన విద్యను అభ్యసించి ప్రతిఒక్కరూ ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ ఆర్‌సిసిఎఫ్ నేషనల్ జనరల్ సెక్రెటరీ మధుమోహన్, నేషనల్ కోఆర్డినేటర్ శివశంకర్, జిల్లా ఉమెన్ వింగ్ ఉపాధ్యక్షురాలు సల్మా, ఆన్సర్ బాష, రాజేంద్ర పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై బురద చల్లడమే జగన్ రాజకీయం

### మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు

**ప్రజాశక్తి- రామకుప్పం:** కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని ప్రభుత్వంపై బురద చల్లడమే జగన్ రాజకీయమని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల కష్టాలను తెలుసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్కరికి లబ్ధి పొందేలా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. దీన్ని ఓర్వలేని జగన్ సైకో గ్యాంగ్ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ అలజడులు సృష్టిస్తున్నారని, నవరత్నాలతో రైతులు, ప్రజలను నట్టేట ముంచేసిన నైజం వైసిపిది అన్నారు. టిడిపి హయాంలో పంటలకు బీమా, సబ్సిడీ ఇచ్చి రైతులను ఎన్నో సందర్భాల్లో ఆదుకుందన్నారు. ఎరువులు వాడకం తగ్గించుకోవాలని ముందు చూపుతో చంద్రబాబు ప్రకృతి వ్యవసాయంకు నాంది పలికారని, మామిడి రైతులకు నాలుగు రూపాయలు సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారని అన్నారు. ప్రజానీకం ఐదేళ్ల రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన సైకో ప్రభుత్వాన్ని చెత్తబుట్టలో పడేసిందన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన

**ప్రజాశక్తి- రొంపిచర్ల:** రొంపిచర్ల మండలం కస్తూరిబా గురుకుల బాలికల విద్యాలయంలో గురువారం పాఠశాల విద్యార్థులకు సిడిపిఓ వాణి శ్రీదేవి బాలవివాహాలపై సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఓ వాణిశ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థినిలు గుడ్ టచ్, బాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బాలికలు వ్యక్తిత్వ వికాసం, సమాజంలో జరిగే మంచి చెడుల గురించి అవగాహన కలిగి ఉండాలని, చట్టాల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. నెలసరి సమయంలో పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని, స్కిల్ డెవలప్మెంట్ అభివృద్ధి చేసుకోవాలని, పోక్సో చట్టంపై అవగాహన పెంచుకుని జాగ్రత్తగా మెలగాలని సూచించారు. ఎవరికైనా ఆపద జరుగుతున్నట్టు తెలిస్తే 1098 నెంబర్ కు కాల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రొంపిచర్ల ఎస్సై బి.సుబ్బారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 17న మండల స్థాయి క్రీడాపోటీలు

**ప్రజాశక్తి - రొంపిచర్ల:** పులిచెర్ల మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 17వ తేదీ అండర్ -14, 17 సంవత్సరాల విద్యార్థులకు క్రీడాపోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు సి.సిద్ధరామయ్య, పి.తాతయ్య తెలిపారు. ఈ క్రీడాపోటీల గురించి గురువారం ఎంఈఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, చదరంగం, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.



# సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశం




సర్వసభ సమావేశం మాట్లాడుతున్న అధికారులు

**ప్రజాశక్తి- తవణంపల్లి:** మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పట్నం ప్రతాపరెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గురువారం అన్ని శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. తహశీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ రెవెన్యూకి సంబంధించిన రీ సర్వే సమస్యలు పరిష్కరించడం జరిగిందని, సోలార్ ప్లాంట్‌కి 67ఎకరాలు గుర్తించామని, స్పందన అర్జీలు రెవెన్యూకి సంబంధించిన పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఇంకా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలియజేశారు. అదేవిధంగా విద్యుత్ శాఖ అధికారి కిషోర్ మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ గురించి వివరించారు. ఆరోగ్య సమస్యలు పరిశుభ్రత గురించి ఆరోగ్యశఖ అధికారులు, మహిళ సమాఖ్య సమస్యలపై ఆయా శాఖల అధికారులు మాట్లాడారు. ప్రభుత్వం అందించే పథకాలు ప్రజలతో కలిసి ప్రజాసమస్యలు పరిష్కార మార్గం చూపిస్తామని తెలియజేశారు. ఉపాధి హామీలో మొక్కలు నాటడం గురించి ఎపిఓ బాల తెలియజేశారు. వ్యవసాయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ ఈక్రాప్, యూరియా పంపిణీపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఇంచార్జ్ రెడ్డి బాబు, జడ్పిటిసి భారతి మధుకుమార్, వైస్ ఎంపీపీ అనసూయమ్మ, వైద్యాధికారి ప్రియాంక పాల్గొన్నారు.

# రోజా కుమార్తెకు మౌరీన్ బిగ్గర్స్ అవార్డు



**ప్రజాశక్తి- విజయపురం (నగరి):** యునైటెడ్ స్టేట్స్ బ్లూమింగ్‌టన్‌లోని ఇండియానా యూనివర్సిటీలో బ్యాచలర్ ఆఫ్ సైన్స్ ఇన్ కంప్యూటర్స్ కోర్సు చదువుతున్న మాజీ మంత్రి ఆర్కేరోజా కుమార్తె అన్షుమాలిక అత్యంత ప్రతిష్టాత్మకమైన మౌరీన్ బిగ్గర్స్ అవార్డు 2025–26ను కైవసం చేసుకున్నారు. ఇండియానా యూనివర్సిటీ ఆఫ్ ఎక్సెలెన్స్ ఫార్ ఉమెన్ అండ్ టెక్నాలజీ వ్యవస్థాపకురాలు, ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ మౌరిన్ బిగ్గర్స్ టెక్నాలజీలో ఈక్విటీని ప్రోత్సహించడంలో 15 సంవత్సరాల పాటు పోషించిన పరివర్తనాత్మక నాయకత్వాన్ని గౌరవించేందుకు 2023 నుంచి యూనివర్సిటీ వారు ఈ అవార్డును ప్రధానం చేస్తున్నారు. సాంకేతికతలోను సమానత్వం ఉండాలని, పేదవర్గాల వారికి సాంకేతిక విద్యావకాశాలు అందుబాటులోకి రావాలన్న దిశగా దీర్ఘకాలిక నిబద్ధతను ప్రదర్శించే విద్యార్థులకు మాత్రమే ఈ అవార్డును అందిస్తారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును తన ప్రతిభతో అన్షుమాలికా ఈ ఏడాది దక్కించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వెనుకబడిన వర్గాలకు కలుపుకొని వారికి గల సాంకేతిక అవకాశాలపై అధ్యయనం చేయడం, నమీబియా, నైజీరియా, ఇండియా వంటి దేశాలలో వెనుకబడిన వర్గాల్లో సాంకేతిక విద్యను పెంపొందించే కోడింగ్ శిబిరాలకు నాయకత్వం వహించడం, మహిళలకు వెబ్ డెవలప్‌మెంట్ శిక్షణ, వివిధ మాధ్యమాల ద్వారా పేదవర్గాలకు సమగ్రమైన సాంకేతిక విద్యను అందించడానికి కృషిచేయడం తదితర అత్యుత్తమ నాయకత్వ లక్షణాలకు గాను ఆమెకు అవార్డును అందించినట్లు యూనివర్సిటీ వెల్లడించింది. కుమార్తెకు అవార్డు దక్కడంపై ఆర్కేరోజా ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ శ్రేణులు సామాజిక మాధ్యమాల ద్వారా అన్షుమాలికకు తమ అభినందనలను తెలియజేశారు.

# ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు




**ప్రజాశక్తి- సోమల:** రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన సోమల, సదుం మండలంలో ఘనంగా నిర్వహించారు. జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ వైస్ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు.

**గంగాధర నెల్లూరు:** రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఎల్లమ్మ ఆలయంలో వైయస్ఆర్టియుసి జైన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నందనూరు సుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రేడ్ యూనియన్ నాయకులు నరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, జలంధర్, సుబ్రమణ్యం, సురేష్, భూపతి పాల్గొన్నారు.

**రామకుప్పం:** రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను వైసీపీ మండల అధ్యక్షుడు బాబురెడ్డి,కో కన్వీనర్ చంద్రారెడ్డి, వైస్ ఎంపిపి1 సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ భరత్ పిఎ మురుగేష్, నేతలు నారాయణస్వామి, యశ్వంత్ రెడ్డి, నటరాజ్, కుమార్ రెడ్డి ఘనంగా నిర్వహించారు.

**పలమనేరు:** పట్టణంలో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక క్లాక్ టవర్ వద్ద వైసీపీ పట్టణ కన్వీనర్ హేమంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

**ఎస్ఆర్ పురం:** రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మాజీ జెడ్పిటిసి గురువారెడ్డి గురువారం ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

**వెదురుకుప్పం:** రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి వెంకట్ మిథున్ రెడ్డి జన్మదినంను పురస్కరించుకొని గురువారం తిరుపతి ఎస్వీయూ యూనివర్సిటీ ఆవరణలో రక్తదాన శిబిరం కేంద్రాన్ని వైఎస్ఆర్సిపి స్టేట్ కార్యదర్శి పేట ధనుంజయులు రెడ్డి ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. హరిప్రసాద్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

**చిత్తూరుఅర్బన్:** రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని చిత్తూరు నగరం సంతపేట కరుమార్యమ్మ దేవాలయం వద్ద వైసిపి రాష్ట్ర మోదిలార్ సంఘం అధ్యక్షుడు జ్ఞాన జగదీష్ ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం సంతపేట కూడలిలో భారీకే కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. మెగా వైద్య శిబిరంను నియోజవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ప్రారంభించారు.




# నేపాల్ నుంచి స్వస్థలాలకు తెలుగు ప్రజలు

### ప్రభుత్వ బాధ్యతను చాటి చెప్పిన నారా లోకేష్ : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి- పలమనేరు:** నేపాల్‌లో జరుగుతున్న మారణ హోమంలో తెలుగు ప్రజలు ఉన్నారని తెలియగానే క్షణం కూడా ఆలస్యం చేయకుండా మంత్రి నారా లోకేష్ స్పందించారని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ప్రశంసించారు. నేపాల్‌లో జరుగుతున్న హింసాత్మాక ఘటనపై ఆయన స్పందిస్తూ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి ఎప్పుడు ఎక్కడ ఆపద వచ్చినా తెలుగుదేశం పార్టీ ముందు ఉంటుందన్న విషయం నేపాల్ ఘటనతో మరోసారి స్పష్టమైందని తెలిపారు. నేపాల్‌లో అల్లర్లు జరుగుతున్నాయన్న విషయం తెలియగానే లోకేష్ తన అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సహాయక చర్యలను వేగవంతం చేశారన్నారు. దీని ద్వారా బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పడమే గాక ఎక్కడెక్కడ ఉన్నారో లోకేషన్ కోఆర్డినేటర్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయించి, నేపాల్‌లో చిక్కుకుపోయిన ప్రజలకు ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించేలా చూశారన్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకొని ఆపదలో ఉన్న ఒక్కొక్కరిని సురక్షితంగా రక్షించి 215 మందిని వారి స్వస్థలాలకు తరలించడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. గత జూన్ నెలలోనూ కంబోడియాలో మోసపూరిత ఉద్యోగ ఆఫర్లతో చిక్కుకున్న మీసాల ఆదిబాబు వంటి తెలుగు యువకులను లోకేష్ బాబు రక్షించడాన్ని గుర్తు చేశారు.

### ప్రజల క్షేమమే ప్రథమ కర్తవ్యం: ఎమ్మెల్యే

**చిత్తూరుఅర్బన్:** రాష్ట్రంలోని ప్రజల క్షేమమే ప్రథమ కర్తవ్యంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగువారికి ఎప్పుడు.. ఎక్కడ.. ఏ ఆపద వచ్చినా మేమున్నామంటూ వారిని ఆదుకోవడంలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందనే విషయాన్ని మంత్రి నారా లోకేష్ మరోసారి నిరూపించారన్నారు. నేపాల్‌లో చెలరేగిన తీవ్రఆందోళనలు నేపథ్యంలో అక్కడి తెలుగు ప్రజలను సురక్షితంగా రాష్ట్రానికి రప్పించేందుకు మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి: డీపీవో

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** గ్రామీణ ప్రాంతాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామసచివాలయం, ఎస్డబ్ల్యూపీసీ ప్రాంతాలను సచివాలయ సిబ్బందితో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులు ప్రబల కుండా ఉంటుందని, అలాగే మురుగునీరు వీధులపై ప్రవహించకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని అన్నారు. వారానికి ఒకసారి మురుగు నీటి కాలువలు, చేతి పంపులు, నీటి నిల్వల ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లి క్లోరినేషియన్ చేయాలని సూచించారు. ఇంటింటికీ సేకరించే పొడి, తడి చెత్తలను ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించి వర్మి కంపోస్టు తయారు చేసి రైతులకు సరఫరా చేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. సర్పంచ్ దివ్యగాంధీ. పంచాయతీ కార్యదర్శులు, పారి శుధ్య కార్మికులు పలువురు పాల్గొన్నారు.



కొల్లాగుంట ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో సుధాకర్రావు

# క్రైం న్యూస్

## అక్రమంగా తరలిస్తున్న బియ్యం స్వాధీనం

### రెండు వాహనాలు సీజ్, ఇద్దరిపై కేసు నమోదు



**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని మొగిలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తిరుపతి నుండి బెంగళూరుకు రెండు వాహనాల్లో 340 బస్తాల రేషన్ బియ్యంను తరలిస్తూ పట్టుబడ్డారు. గంగవరం మండలానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు భానుమూర్తి ఘంటావోరుకు చెందిన మురళీధర్ కుమారులు రోషన్ ఇరువురిని అదుపులో తీసుకొని అక్రమంగా తరలిస్తున్న లక్ష 42 వేల రూపాయలు విలువగల బియ్యాన్ని, రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని ఇరువురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో డిటి బాబు, ఎస్సై ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ బాబు పాల్గొన్నారు.

## మిట్టపల్లి గ్రామంలో చోరీ

### 31 గ్రాముల బంగారు నగలు ఆపహరణ

**ప్రజాశక్తి- రామకుప్పం:** రామకుప్పం పంచాయతీ పరిధిలోని మిట్టపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో బంగారం చోరీ జరిగిన సంఘటన చోటు చేసుకుంది. బాధితురాలు మునిరత్నమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా... బుధవారం ఉదయం తమ సొంత పనుల నిమిత్తం భాధితురాలు తన ఇంటికి తాళం వేసుకొని కుప్పంకు వెళ్ళింది. మధ్యాహ్నం ఇంటి పక్కన ఉన్నవారు మునిరత్నమ్మకు ఫోన్ చేసి టీ తాగేందుకు రమ్మన్నారు. ఆ సమయంలో తాను కుప్పంలో ఉన్నానని చెప్పగా మీ ఇంటి తలుపులు తీసి ఉందని పక్కింటి వారు తెలిపారు. దీంతో మునిరత్నమ్మ అక్కడినుంచి హడావుడిగా బయలుదేరి స్వగ్రామానికి చేరుకుని చూడగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న 31 గ్రాముల బంగారాన్ని చోరీ చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. దుండగులను త్వరలోనే పట్టుకుంటామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట మోహన్ తెలిపారు.


## స్టాటర్లో కేబుల్ కట్ చేసిన దొంగలు

**ప్రజాశక్తి- విజయపురం:** మండలంలో కేబుల్ దొంగలు బాబోయ్... అంటూ రైతులు ఆందోళన చెంతున్నారు. మండలంలో నెల రోజుల కాలంలో సుమారు 40 మంది రైతుల స్టాటరు వైర్లు, మోటారు కేబుల్ వైర్లు చోరీకి గురైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న వ్యవసాయ మోటర్ల వైర్లు తరచూ చోరీకి గురౌతున్నాయని రైతులు వాపోయారు. మండలంలోని ఆలపాక కండ్రిగలో 15 రోజుల కాలంలో రెండు పర్యాయాలు మోటారు వైరు కెబుల్ చోరీకి గురైందని సర్పంచ్ బాబు తెలిపారు. కళియంబాకం, పన్నూరు, బూచివానత్తం, సామిరెడ్డికండ్రిగ ప్రాంతాలలో సైతం మందు బాబులు మద్యానికి బానిసై దొంగతనానికి పాల్పడుతున్నారని, ఈ విషయమై పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దొంగతనం జరిగిన ప్రతిసారి వైర్లు కొనుగోలు చేయలేక అప్పుల పాలవుతున్నామని చెబుతున్నారు. చోరీపై పోలీసులు నిఘా పెట్టాలని, అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

## ఉపాధ్యాయుల నిరసన

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** ఎపిటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారం కొరకు డీఏ, 12వ పిఆర్‌సి, ఐఆర్ 11 పిఆర్‌సి అరియర్స్ మంజూరు చేయాలని ఏపిటిఎఫ్ మండల శాఖ తరఫున మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తవణంపల్లి మండలంలోని జెపిహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా అధ్యక్షులు జగదీష్ ఆధ్వర్యంలో, జెపిహెచ్ఎస్ కాలేపల్లిలో ప్రధానకార్యదర్శి ప్రభాకర్ ఆధ్వర్యంలో, చిత్తూరు నగరంలో ఎపిటిఎఫ్ గౌరవ అధ్యక్షులు ముక్తార్ అహ్మద్, పిడివి కండ్రిగ జెపిహెచ్ఎస్ పాఠశాలలో గౌరవ సలహాదారు గోపినాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట : ఈవో



**ప్రజాశక్తి -తిరుమల:** శ్రీవారి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా నిర్వహించేందుకు అధికారులు సమిష్టిగా పనిచేయాలని టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2వ తేది వరకు జరగునున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలపై గురువారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శాఖలవారీగా ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బ్రహ్మోత్సవాలకు చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. ఈవో మాట్లాడుతూ పారిశుద్ధ్యానికి పెద్ద పీట వేయాలని ఆయన వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సమయంలో మాడ వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు అదనంగా అవసరమైనంత సిబ్బందిని తీసుకోవాలని ఆదేశించారు. గరుడ వాహనం రోజున సీనియర్ అధికారులకు మాడవీధుల్లో విధులు కేటాయించి భక్తుల నుండి ఎప్పటికప్పుడు అభిప్రాయాలను సేకరించాలన్నారు. గ్యాలరీల్లోని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేయాలన్నారు. తిరుమలలో అవసరమైన మేరకు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా తిరుపతిలో ప్రత్యేక పార్కింగ్ లు ఏర్పాటు చేయాలన్నారు. నాదనీరాజనం వేదికపై పేరొందిన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. దాదాపు 3500 మంది శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. చిన్న పిల్లలు తప్పిపోకుండా జియో ట్యాగింగ్ విరివిగా చేపట్టరన్నారు. 4వేల సీసీ కెమెరాలతో పాటు అదనంగా అవసరమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. శ్రీవారి మెట్టు, అలిపిరి నడకమార్గాల్లో మరింత అప్రమత్తంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ విభాగంలో సమస్యలు తలెత్తకుండా సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ టీటీడీ సీవీఎస్వో మురళీకష్ణ, సీఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.